www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 4 సంచిక -16 బుధవారం 29 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545



# గ్రోత్ ఇంజిన్‌గా గూగుల్


- గూగుల్ ..ఎపికి గేమ్ ఛేంజర్
- దేశానికి ఎపి డేటా గేట్‌వేగా నిలుస్తుంది
- 2028 నాటికి గూగుల్ సెంటర్ పూర్తి
- ఎండీయూలాలతోనే కాదు..వాటిని ముందుకు తీసుకెళ్తున్నాం
- గూగుల్ సెంటర్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం,,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** గూగుల్ రాక.. విశాఖకే కాదు.. ఏపీకి ఒక గేమ్ ఛేంజర్ అని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ చరిత్రలో మరచిపోలేని రోజు ఇదన్నారు. భారతదేశానికి ఏపీ..అంతర్జాతీయ డేటా గేట్‌వేగా నిలుస్తుంది. విశాఖలోని తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి భూమి పూజ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం**మిగతా 2లో...**

## గూగుల్ తో మారనున్న విశాఖ ముఖచిత్రం

### సరికొత్త చరిత్రకు నాంది పలికాం

#### గూగుల్ సెటంర్ కార్యక్రమంలో లోకేశ్



డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో ప్రయోజనాలు చూపిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తర్లువాడలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు భూమిపూజ**మిగతా 2లో...**

## నేడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు

### రెండోదశలో 142 స్థానాలకు పోలింగ్

ఓటరు చేతిలో 1,448 మంది అభ్యర్థుల భవితవ్యం

మే 4న తుది ఫలితాలు



**కోల్‌కతా :ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** పశ్చిమబెంగాల్‌లో బుధవారం రెండోదశ పోలింగ్ జరగనున్నది. ఏడు జిల్లాల పరిధిలోని 142 నియోజకవర్గాల్లో ఉన్న సుమారు 3.21 కోట్ల మంది ఓటర్లు 1,448 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరుగుతుంది. మొదటి దశ పోలింగ్‌లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదై రికార్డు సృష్టించింది.**మిగతా 2లో...**

## తెలంగాణ పోలీస్ సారథి సీవీ ఆనంద్

- నూతన డీజీపీగా నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 30న ప్రస్తుత డీజీపీ శివధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ
- అదే రోజు లేదా మే1న ఆనంద్ బాధ్యతల స్వీకరణ!



**హైదరాబాద్,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగానికి కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ ఆర్టీ నం.553 జారీ చేసింది. ప్రస్తుతం హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా**మిగతా 2లో...**

## ఇంధన భయం..

- ధరలు పెరుగుతాయనే ఆందోళన, కొరత భయాలు..
- పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల క్యూ
- వివిధ రాష్ట్రాల్లోని ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే ఆందోళన
- పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు
- సైబరాబాద్ పోలీస్ పెట్రోల్ బంకు వద్ద బారులు తీరిన కార్లు

**హైదరాబాద్ ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు పూర్తవుతుండటంతో ఇంధన ధరలు పెరుగుతాయనే ఆందోళనతో పాటు పెట్రోల్, డీజిల్ కొరత భయాలతో హైదరాబాద్ నగరంలో వాహనదారులు పెట్రోల్ బంకుల వద్ద వరుస **2లో...**



## 70 నిముషాల్లోనే ప్రయాణం

### అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్

#### చంద్రబాబు విజినరీ లీడర్ -కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

**విశాఖపట్నం, ,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** చంద్రబాబు నేతృత్వంలో విశాఖపట్నం త్వరలోనే ఐటీపట్నం కాబోతోందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. అమరావతి - హైదరాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల రాజధానుల మధ్య 70 నిమిషాల్లో, చెన్నై నుంచి అమరావతికి 112 నిమిషాల్లో ప్రయాణం సాధ్యమవుతుందని వివరించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల 08 నిమిషాల్లో ప్రయాణం చేయవచ్చన్నారు.**మిగతా 2లో...**



## భావితరాల కోసమే ఫ్యూచర్ సిటీ

- మరో సింగపూర్‌ను సృష్టిస్తాం..
- ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం
- నిరుద్యోగ యువతకు
- ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- ఫ్యూచర్‌సిటీలో కలపమని సమీప గ్రామాల నుంచి వినతులు వస్తున్నాయి
- పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- 20మంది మావోయిస్టులకు టూరిస్ట్‌గైడ్‌లుగా నియామకపత్రాలు

**కందుకూరు,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**భవిష్యత్ తరాల కోసమే ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీన్ని మరో సింగపూర్‌గా తీర్చి దిద్ది, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను అమలు చేస్తుందని స్పష్టంచేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ రెవెన్యూ పరిధిలో ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ భవనానికి **మిగతా 2లో...**



## ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు రష్యా మధ్యవర్తిత్వం



- చర్చలపై ఇరాన్ సమాలోచనలు
- అగమ్యగోచరంగా అమెరికా పరిస్థితి
- ముందుకెళ్తే చైనా..వెనక్కొస్తే ఇరాన్
- యుద్ధంలో ఇరుక్కున్న ట్రంప్
- ఒపెక్, ఒపెక్ ప్లస్‌కు యూఏఈ గుడ్‌బై

**టెహ్రాన్/వాషింగ్టన్ :ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** రష్యా అందిస్తున్న మద్దతుకు, సంఘీభావానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కృతజ్ఞతలు తెలిపారు. అరాగ్చీ సోమవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమైన విషయం తెలిసిందే. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను నివారించే విషయంలో **మిగతా 2లో...**

# గ్రోత్ ఇంజిన్‌గా గూగుల్




,మొదటిపేజీ తరువాయి

గూగుల్‌కు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ ఏఐ డేటా సెంటర్.. ఏపీ టెక్నాలజీతోపాటు దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందన్నారు. టెక్నాలజీ హబ్‌కు భవిష్యత్‌లో తుర్లవాడ పేరు మార్మోగుతుందన్నారు. టెక్నాలజీలో ఏపీ సగర్వంగా తలెత్తుకొని నిలబడుతుంది. కొత్త ఆవిష్కరణలకు ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ స్వాగతం పలుకుతుంది. ఏఐ డేటా సెంటర్ ఒక గిగావాట్ సామర్థ్యంతో పని చేస్తుంది. సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. ఇప్పుడు భారత్ గ్రోత్ ఇంజిన్‌గా మారబోతోంది. ప్రముఖ సంస్థలు విశాఖలో పెట్టుబడులకు రావడం శుభపరిణామం. గూగుల్ ఆవిష్కరణలు.. ఏపీ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ రెండూ కలుస్తున్నాయి. ఓడరేవుల వంటి రంగాల్లో పని చేస్తున్న ప్రతిష్ఠాత్మక సంస్థ అదానీ.. ప్రజలకు కమ్యూనికేషన్‌తో అనుసంధానం చేస్తున్న మరో సంస్థ ఎయిర్‌టెల్.. ఈ మూడు సంస్థలు ఎప్పుడూ నూతన ఆలోచనలు చేస్తుంటాయన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణం పూర్తి కావాలి. రెండు, మూడు నెలలు ముందుగానే పూర్తి చేసేందుకు సహకరిస్తాం. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును జాతికి అంకితం చేస్తాం. భవిష్యత్‌లో అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా మారుతుంది. వ్యాపార నిర్వహణ ఖర్చు.. మిగిలిన నగరాలకంటే చాలా తక్కువగా ఉంటుంది. జూన్ 1న దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. ఎంవోయూలకే పరిమితం కాదు.. ముందుకు ఎలా తీసుకెళ్లాలో చూపిస్తున్నాం. పెట్టుబడులు, ఒప్పందాలే కాదు.. ప్రారంభంలోనూ ముందున్నాం అని చంద్రబాబు అన్నారు. అలాగే విశాఖకు గూగుల్ రాక ఉత్తరాంధ్రకే గర్వకారణమని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటవుతోందని తెలిపారు. విశాఖను గూగుల్ ఎంపిక చేసుకోవడం ఏపీకి గర్వకారణమని వ్యాఖ్యానించారు. గూగుల్, ఎయిర్‌టెల్ రెండూ కీలక సంస్థలని వెల్లడించారు. సెప్టెంబర్ 2028 నాటికి గూగుల్ డేటా సెంటర్ పూర్తవుతుందని స్పష్టం చేశారు. అతి త్వరలో అన్నిరంగాల్లో ఏఐ సేవలు వస్తాయని వివరించారు. 60 రోజుల్లో అనకాపల్లి, విశాఖపట్నానికి గోదావరి నీళ్లు వస్తాయని చెప్పుకొచ్చారు. గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రారంభిస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. విశాఖకు అద్భుతమైన కనెక్టివిటీ ఉందని తెలిపారు. 2028 చివరినాటికి ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ తొలిదశ పూర్తి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏఐ సిటీగా విశాఖ ఉంటుందని.. తెలిపారు. టెక్నాలజీలో దేశానికే గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ ఉందని వెల్లడించారు. పెట్టుబడిదారులే ఏపీకి భాగస్వాములని చెప్పారు. ఒప్పందాలే కాదని.. గ్రౌండింగ్ కూడా తమదే బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఎఐ యుగంలో గూగుల్ డేటా సెంటర్ కీలకం

### గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఆంధ్రప్రదేశ్ పరుగులు

### గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే

: ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. మంగళవారం ఉదయం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమి పూజ చేశారు. వన్ గిగా వాట్ సామర్థ్యంతో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో మెగా డేటా సెంటర్‌ను గూగుల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. డేటా సెంటర్‌కు తర్లువాడ, అడవివరం, రాంబిల్లిలో మొత్తం 600 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అన్ని రకాల అనుమతులను సర్కార్ క్లియర్ చేసింది. ఈ సందర్భంగా గూగుల్ క్లౌడ్, గ్లోబల్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే మాట్లాడుతూ... గూగుల్ ఇండియా ఏఐ హబ్‌కు ఇవాళ చేసిన శంకుస్థాపన 2047 వికసిత్ భారత్‌కు ఓ పునాదిరాయి లాంటిదన్నారు. ఏఐ యుగంలో విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌లోనూ ఈ డేటా సెంటర్ అత్యంత ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. గ్లోబల్ ఏఐ ఎకానమీ దిశగా ఇప్పుడు విశాఖ, ఆంధ్రప్రదేశ్ పరుగులు పెడుతోందని అన్నారు. ఇంటర్నేషనల్ సబ్ సీ గేట్ వేగా ఉన్న ముంబై, చెన్నైలతో పాటు విశాఖ కూడా కీలకంగా మారిందని వెల్లడించారు. కొత్త ఫైబర్ ఆప్టిక్ లైన్లు ఇతర ప్రాంతాలతో విశాఖను అనుసంధానం చేస్తాయని బికాస్ కోలే తెలిపారు. సముద్ర గర్భ లైన్లతో సంప్రదాయ నౌకాయాన మార్గాలు ఇక డిజిటల్ ట్రేడ్ రూట్లుగా మారతాయన్నారు. అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ట్రాలు ఈ డేటా సెంటర్ ఏర్పాటులో భాగస్వామ్యం వహిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఎదుగుతున్న ఈ ప్రాంతానికి టెక్ ఫ్యూచర్‌ను అందించేలా ఈ డేటా సెంటర్ ఉంటుందని చెప్పారు. స్థానిక యువతకు ఉద్యోగ భద్రత, ఇంధన భద్రత, నీటి వినియోగం లాంటి అంశాలతో స్థానిక భాగస్వామ్యంతో ముందుకు అడుగులు వేస్తామన్నారు. యువతకు భవితను అందించేలా వారికి అడ్వాన్స్‌డ్ క్లౌడ్, ఏఐలో శిక్షణ కార్యక్రమాలను గూగుల్ నిర్వహిస్తుందని తెలిపారు. 10 వేల మందికిపైగా మహిళలకు మైక్రో ఎంటర్‌ప్రైజ్‌గా మారేందుకు సహకారం అందిస్తుందని అన్నారు. న్యూ ట్రాన్స్ మిషన్ లైన్లు, ఎనర్జీ స్టోరేజి సిస్టమ్స్ లాంటివి ఈ ప్రాంతానికి ఇంధన భద్రతను కల్పిస్తాయన్నారు. విశాఖలోని వివిధ నివాస ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ ప్రాంతానికి ఆర్థిక స్థిరత్వం కల్పించేలా ఈ డేటా సెంటర్ నిర్మితం అవుతుందని బికాస్ కోలే వెల్లడించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనిత, బాల వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సరికొత్త చరిత్రకు నాంది పలికాం

చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ డేటా సెంటర్‌కు తర్లువాడ, రాంబిల్లి, అడవివరంలో 600 ఎకరాలను ఏపీ సర్కార్ కేటాయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ అంటే గూగుల్ అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒకలెక్క.. ఇక నుంచి మరో లెక్క అని చెప్పుకొచ్చారు. ఇవాల్టి నుంచి విశాఖ ముఖచిత్రం మారబోతోందని తెలిపారు. సరికొత్త చరిత్రకు ఇవాళ పునాదిగా మారిందని వెల్లడించారు. ఇకపై డేటా ఏఐ హబ్‌గా విశాఖపట్నం మారుతోందని వివరించారు. పెట్టుబడులతో ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లు ఏపీలో విధ్వంస పాలన చూశామని విమర్శించారు. గూగుల్ ప్రాజెక్టు తెచ్చిందెవరని గూగుల్‌ని అడిగితే చంద్రబాబు పేరే చెబుతోందని అన్నారు. వైసీపీ పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు భయపడ్డారని ఆరోపించారు. తమది గూగుల్.. వైసీపీది గొడ్డలి.. బోత్ ఆర్ నాట్ సేమ్ అని చెప్పుకొచ్చారు. నమో అంటే నాయుడు.. మోదీ అని మంత్రి లోకేశ్ అభివర్ణించారు.

## 70 నిముషాల్లోనే ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

చెన్నై నుంచి కోల్‌కతా మధ్య రైల్వే లైన్లను 4 లేన్లుగా విస్తరించే పనులు చేపడతామని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

గతంలో చంద్రబాబు సైబరాబాద్ నిర్మించారని.. ఐటీ అభివృద్ధిలో సైబర్ టవర్‌ది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు విజన్‌కు సెల్యూట్ చేస్తున్నామని అన్నారు. ఆయనను దేశం గర్వించే విజనరీ లీడర్‌గా కేంద్రమంత్రి అభివర్ణించారు. యువనేత లోకేశ్ ఎనర్జీ, నాయకత్వం అద్భుతమని కొనియాడారు. సమస్యల పరిష్కారంలో యువనేతలకు లోకేశ్ ఆదర్శమని పేర్కొన్నారు. తయారీ రంగంలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయని, భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్ తయారీ అత్యంత కీలకమని అశ్విని వైష్ణవ్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో భారత్ కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. 2024 నుంచి సెమీకండక్టర్ల తయారీపై కేంద్రం దృష్టి సారించిందని తెలిపారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థలు విశాఖపట్నానికి రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జూన్ 1 నుంచి విశాఖపట్నం రైల్వే జోన్‌ను నోటిఫై చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటించారు.

## నేడు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఎన్నికల సంఘం(ఈసీ) విస్తృతమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టింది. ఏడు జిల్లాల్లో కలిపి 2,321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించి ంది. కోల్‌కతాలో బలగాల మోహరింపు అధికంగా ఉంది. ఇక్కడ 273 కంపెనీల బలగాలు మోహరించాయి. మొత్తం 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది పోలీసు పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించారు.

ఓటర్ల పరంగా చూస్తే..

రెండో విడతలో భాగంగా మొత్తం 3.21 కోట్ల మంది ఓటర్లలో.. 1.64 కోట్ల మంది పురుషులు, 1.57 కోట్ల మంది స్త్రీలు, 792 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. భౌగోళిక విస్తీర్ణం పరంగా ఎన్నికలకు వెళ్తున్న నియోజకవర్గాల్లో అత్యంత చిన్నది కోల్‌కతాలోని జోరాసంకో కాగా, అత్యంత పెద్దది నదియాలోని కళ్యాణి. ఓటర్ల సంఖ్య పరంగా అత్యంత చిన్న నియోజకవర్గం భాట్‌పారా (1,17,195 మంది ఓటర్లు) కాగా, అత్యంత పెద్దది చుంచురా (2,75,715 మంది ఓటర్లు). రెండవ దశలో ఎన్నికలకు వెళ్తున్న 142 స్థానాలు ఏడు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఇందులో ఉత్తర 24 పరగణాలు (33 స్థానాలు), దక్షిణ 24 పరగణాలు (31), నదియా (17), హౌరా (16) కోల్‌కతా (11), హుగ్లీ (18), పుర్బా బర్ధమాన్ (16)లు ఉన్నాయి.

## ఇంధన భయం..

మొదటిపేజీ తరువాయి

కడుతున్నారు. నిన్న, నేడు నగరవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల కొద్దీ క్యూ కనిపించింది. నిల్వలు తగ్గిపోవడం లేదా విపరీతమైన డిమాండ్ కారణంగా పలు పెట్రోల్ బంకులను తాత్కాలికంగా మూసివేశారు.పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా డీజిల్ దొరకడం లేదు. దీనితో ఇంధనం దొరికే బంకుల్లో రద్దీ పెరుగుతోంది. వాహనదారులు సైబరాబాద్ పోలీస్ పెట్రోల్ బంకు వద్దకు బారులు తీరారు. ఈ బంకు వద్ద దాదాపు రెండు కిలోమీటర్ల మేర కార్లు వరుస కట్టాయి.

## తెలంగాణ పోలీస్ సారథి సీవీ ఆనంద్

మొదటిపేజీ తరువాయి

పనిచేస్తున్న ఆనంద్‌ను బదిలీ చేసి, ఎంపిక ప్రక్రియ అనంతరం డీజీపీగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. యూపీఎస్సీ మార్గదర్శకాల ప్రకారం ఎంపానెల్ కమిటీ సిఫారసుల ఆధారంగా ఈ నియామకం జరిగినట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) రామక్రిష్ణారావు వెల్లడించారు. కాగా ప్రస్తుత డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి ఈనెల 30న పదవీ విరమణ చేస్తున్నారు. అదే రోజు లేదా మరుసటి రోజు (మే1న) రాష్ట్ర పోలీసు పగ్గాలను ఆనంద్ చేపట్టనున్నారని తెలిసింది. అదే సమయంలో మరికొందరు సీనియ ఐపీఎస్‌ల బదిలీలు కూడా జరిగే అవకాశం ఉందని సమాచారం.1968 జూన్ 5న హైదరాబాద్ పాతబస్తీలోని పేట్లబుర్జ్ ప్రభుత్వ ఆస్పత్రిలో జన్మించిన ఆనంద్, విద్యారంగంలోనే కాక క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నిజాం కాలేజ్‌లో చదివిన ఆయన, ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. యువకుడిగా హైదరాబాద్ అండర్-19 క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఆయన, కెరీర్ ప్రారంభంలోనే మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో ధైర్యవంతమైన ఆపరేషన్లతో గుర్తింపు పొందారు. నిజామాబాద్ ఎస్పీగా పనిచేసిన సమయంలో నక్సలిజాన్ని అదుపులోకి తీసుకువచ్చినందుకు ప్రెసిడెంట్ గ్యాలంట్రీ మెడల్ అందుకున్నారు.హైదరాబాద్ నగరంలో డీసీపీగా పనిచేసిన సమయంలో గణేశ్ నిమజ్జన నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా ఈ-చలాన్, డ్రంక్ డ్రైవింగ్ నియంత్రణ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్', సీసీటీవీల విస్తరణ వంటి కీలక చర్యలు చేపట్టారు. యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) డీజీగా, సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు రేషన్ వ్యవస్థలో ఈ-పాస్ యంత్రాలు, జీపీఎస్ ట్రాకింగ్ అమలు చేసి పారదర్శకతను పెంచారు

## ఇరాన్ శాంతి ప్రతిపాదనలకు రష్యా మధ్యవర్తిత్వం

మొదటిపేజీ తరువాయి

మధ్యవర్తిత్వం వహించేందుకు రష్యా సానుకూలత వ్యక్తం చేసిందని సమాచారం.

చర్చలను తిరిగి ప్రారంభించాలన్న అమెరికా అభ్యర్థనను ఇరాన్ పరిశీలిస్తోందని అరాగ్చీ తెలిపారు. తొలి విడత చర్చలు విఫలం కావడానికి అమెరికాయే కారణమని ఆయన ఆరోపించారు. ఇరాన్‌కు చెందిన రెండు చమురు నౌకలు మెజెస్టిక్ ఎక్స్, తిఫానీలను అమెరికా స్వాధీనం చేసుకోవడంపై టెహ్రాన్ విదేశాంగ శాఖ మండిపడింది. ఈ చర్య సముద్ర దోపిడీని చట్టబద్ధం చేస్తోందని ధ్వజమెత్తింది. ఇదిలావుండగా యుద్ధానికి ముగింపు పలికేందుకు, హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అందజేసిన తాజా శాంతి ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ భద్రతా బృందం సమీక్షిస్తోంది. చర్చలలో తమ అణు కార్యక్రమాన్ని ప్రస్తావించవద్దని, దానిపై తర్వాత చర్చిద్దామని ఇరాన్ సూచించింది. అయితే ఇరాన్ ప్రతిపాదనలపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారని, వాటిని ఆయన ఆమోదించబోరని అమెరికా మీడియాలో వార్తలు వచ్చాయి. హోర్ముజ్ జలసంధిని తక్షణమే, ఎలాంటి ఆటంకాలు లేకుండా తెరవాలంటూ పలు దేశాలు కోరుతున్నాయి. బావీఎరైన్ నేతృత్వంలో ఆయా దేశాలు ఈ మేరకు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశాయి.

**దిగ్బంధాన్ని తప్పించుకొని హోర్ముజ్‌ను దాటుతున్న నౌకలు**

హోర్ముజ్ జలసంధిని అమెరికా నౌకాదళం దిగ్బంధించినప్పటికీ అనేక చమురు నౌకలు దానిని దాటుకొని ప్రయాణం సాగిస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌కు తూర్పు వైపున మోహరించిన అమెరికా దళాలు నౌకల రాకపోకలను నియంత్రిస్తూ, ఆంక్షలను అమలు చేస్తున్నాయి. అయితే ఇరాన్‌కు చెందిన ఖర్గ్ దీవి నుంచి నేరుగా ముంబయికి చేరుకునే మార్గం ఒకటుందని పరిశీలకులు తెలిపారు.

ఇటీవలే దేశ్ గరిమ అనే భారత నౌక జలసంధిని దాటింది. జగ్ అర్నవ్, సన్మర్ హెరాల్డ్ నౌకలపై ఇరాన్ సేనలు కాల్పులు జరిపిన రోజే దేశ్ గరిమ నౌక హోర్ముజ్‌ను దాటేసింది. అది గత బుధవారం ముంబయికి చేరుకుంది. ఖతార్‌లోని రాస్ లాఫన్ నుంచి బయలుదేరిన ఈ నౌకలో 97 వేల మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఒక్క దేశ్ గరిమ మాత్రమే కాదుడఈ నెల 13న అమెరికా దిగ్బంధం అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకూ 30కి పైగా నౌకలు హోర్ముజ్‌ను దాటాయి. వివిధ దేశాలకు చెందిన నౌకలు ఇరాన్ నుంచి ముంబయి వైపు వస్తున్నాయని వార్తలు అందుతున్నాయి. అయితే ఈ సమాచారాన్ని భారత్, టెహ్రాన్ అధికారులు ఇంకా ధృవీకరించలేదు.ఇప్పటి వరకూ 34 నౌకలు అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని బయటికి వచ్చాయని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలిపింది. హోర్ముజ్ నుంచి బయటికి వచ్చిన నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో ప్రవేశిస్తున్నాయని చెప్పింది. కాగా ప్రస్తుతం హోర్ముజ్‌లో ఇంకా 14 భారత నౌకలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

## భావితరాల కోసమే ఫ్యూచర్ సిటీ

మొదటిపేజీ తరువాయి

మంగళవారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌రాబు, జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. మల్కాజిగిరి ఆక్టోపస్ భవనం, డీసీపీ భవనం, గచ్చిబౌలిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవనాలకూ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడారు. తమ ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రజా పాలనకు కృషి చేస్తోందన్నారు. గ్రామాలను ఫ్యూచర్ సిటీలో చేర్చాలని వినతులు వస్తున్నాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో ఉన్న ఆయా గ్రామాల సర్పంచులు గ్రామసభలు నిర్వహించి, గ్రామసభ పత్రాలను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి అందజేయాలని సూచించారు. అనంతరం ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రపంచంలోనే ఉన్నతంగా ఉండాలనే లక్ష్యంతో ఫ్యూచర్ సిటీలో పోలీస్ కమిషరేట్ భవనం నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.



**అభివృద్ధి పనుల్లో పరుగు**

60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయనీ, రెండు నెలల్లో స్కిల్ భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తామన్నారు. దేశంలోనే ఎక్కడా లేని 360 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టామన్నారు. రైతులకు నష్టం కాకుండా గిట్టుబాటు ధర వచ్చేటట్టు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు సామాన్య ప్రజల పట్ల మానవీయ కోణంలో ఆలోచించి, తమ దగ్గరకు వచ్చిన వారి సమస్యల్ని పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

**శంషాబాద్‌లో బుల్లెట్ రైల్వేస్టేషన్**

దేశంలో ఏడు బుల్లెట్ ట్రైన్స్ మంజూరు చేస్తే మూడు మన రాష్ట్రానికే వచ్చాయనీ, బెంగళూరు- హైదరాబాద్, శంషాబాద్-పూణే, శంషాబాద్- అమరావతి-చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్‌కు మార్గం సుగమమైందని వివరించారు. దీనితో రంగారెడ్డి జిల్లాలో అద్భుతం జరగబోతోందన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు దగ్గర మెట్రో రైలు, బుల్లెట్ రైలు నిర్మాణం కోసం స్టేషన్లు నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్రం శాంతి భద్రతలు బాగున్నాయంటే దానికి పోలీసులే కారణమన్నారు. మిగిలిన మావోయిస్టులు జన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు 820 మంది మావోయిస్టులు లొంగి పోయారని తెలిపారు. గణపతి అనారోగ్యంగా ఉన్నారని తమకు తెలిసిందనీ, వారు లొంగిపోతే ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

**జూన్ 2న ఎఫ్‌టీడీసీ కార్యాలయం ప్రారంభం**

ప్రస్తుత ఫ్యూచర్‌సిటీ ప్రాంతంలో కాలుష్యా న్ని ప్రేరేపించే ఫార్మాస్యూటికల్ కంపెనీలను ఏర్పాటు చేయడానికి గత పాలకులు ప్రయత్నాలు చేశారనీ, వాటిని కాదని తాము భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు.అనంతరం ఇక్కడి నుంచే సమీక్షలు నిర్వహించి పెట్టుబడులను ఆహ్వానిస్తామని తెలి పారు. ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపో తు న్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.





**ఆదివాసీల అభివృద్ధికి పోలీస్ నిధులు : డీజీపీ శివధర్‌రెడ్డి**

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టు లకు పునరావాసం కల్పించే విషయంలో టూరి జం, అటవీశాఖలతో కలిసి కొత్త వ్యూహాలు రచించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. ముఖ్యం గా, తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను ఆనుకొని ఉన్న ఆరు జిల్లాలను ఇంకా సెక్యూరిటీ జోన్‌గానే ప్రభుత్వం చూడటానికి అనుమతించ డంతో ఆ నిధులను కూడా ఆదివాసీల అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నామని చెప్పారు.



## ఒంగోలు, దోర్నాల, మార్కాపురం లో

## స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# విస్తృతంగా గొడుగుల పంపిణీ..



ప్రకాశం జిల్లా,ఒంగోలు నందు,గొడుగుల పంపిణీ కార్యక్రమం.



దోర్నాల యందు, చెప్పులు కుట్టుకునే వ్యక్తికి,గొడుగు పంపిణీ చేస్తున్న దృశ్యం



మార్కాపురం నందు నిర్వహించిన.గొడుగుల పంపిణీ కార్యక్రమం

**ఒంగోలు,(ప్రజావినికిడి):**
గత వారం రోజుల నుండి,స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, తెలుగు రాష్ట్రాలందు,రోడ్డు పక్క చిరు వ్యాపారం చేసుకునే పేదలకు, విస్తృతంగా గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, అందరి మన్ననలను అందుకుంటున్నారు.ప్రతీ కార్యక్రమాన్ని వినూత్నంగా చేపడుతూ,లబ్ధి పొందిన పేదల హృదయాలలో నిలిచిపోతున్నారు. తెలుగు రాష్ట్రాలలోని, వివిధ ప్రాంతాలకు చెందిన వారు,ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు, తమ వంతు ఆర్థిక సాయం అందిస్తూ, వారు సైతం సేవలో పాలుపంచుకోవడం ఎందరికో స్ఫూర్తిదాయకమవుతోంది.సెగలు కక్కుతున్న ప్రస్తుత వేసవికాలంలో, రోడ్డు మార్జిన్ నందు, బతుకుతెరువు కోసం, వివిధ రకాల వ్యాపారాలు, పనులు చేసుకునే వారికి,ట్రస్ట్ వారు, కమర్షియల్ గొడుగులను ఉచితంగా పంపిణీ చేస్తూ,వారికి నీడను కల్పిస్తున్నారు.

ఈ పరంపరలో భాగంగా, మంగళవారం, జిల్లా కేంద్రమైన ఒంగోలు నందు, ప్రకాశం భవన్ దగ్గర,వివిధ ప్రాంతాలలో చెప్పులు కుట్టుకునే వారికి, చిరు వ్యాపారాలు చేసుకునే వారికి, గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్,316 హెచ్ డిస్ట్రిక్ట్ ఎలక్టెడ్ గవర్నర్ లయన్ రావిపూడి లక్ష్మీనారాయణ, రీజనల్ చైర్మన్ ఎన్ రామకృష్ణ, కార్యక్రమ నిర్వాహకులు, జీఎస్టీ ఎగ్జిక్యూటివ్ టాక్స్ అసిస్టెంట్, సిరిగిరి శ్రీనివాసరావు,ట్రస్ట్ ప్రతినిధులు ఎన్ కేశవ,సిహెచ్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైల ముఖద్వారమైన, మార్కాపురం జిల్లా, దోర్నాలయందు, గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని,ట్రస్ట్ ప్రతినిధులు,రిటైర్డ్ అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ యమా దాసయ్య, గుర్రాల ప్రసాద్ నిర్వహించగా, జిల్లా కేంద్రమైన మార్కాపురం నందు జరిగిన కార్యక్రమాన్ని జీఎస్టీ ఈ టి ఏ, సిరిగిరి శ్రీనివాసరావు, మార్కాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షులు, టివి రామకృష్ణారావు, చిన్నపిల్లల వైద్యులు,డాక్టర్ కే.మాధవరావు, న్యాయవాది, భూపతి చిన్న కాశయ్య,దంత వైద్యులు,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలి




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి ):**
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు హిమాయత్‌నగర్ నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వరకు పాదయాత్రగా బయలుదేరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం,వాటిని పట్టించుకోకుండా పోలీసుల ద్వారా అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శి కసిరెడ్డి మణికంఠ రెడ్డి,పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ, ప్రజాపాలన అని మాట్లాడే ప్రభుత్వం విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాడితే, ప్రభుత్వం స్పందించాల్సింది పోయి అరెస్టులతో అడ్డుకోవడం బాధాకరం. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల వల్ల 15 లక్షల మంది విద్యార్థులు విద్యను కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం తాము అధికారంలోకి రాగానే ఏక కాలంలో ఒకేసారి ఫీజుబకాయలు విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నేడు రెండున్నర సంవత్సరాలు గడుస్తుంది. రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల కాకపోవడం మూలంగా విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బంది పడుతున్నారని, కళాశాల యాజమాన్యాలు హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఫీజులు కడితేనే పరీక్ష ఫీజులు తీసుకుంటామని, ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇస్తామని,పూర్తి ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని వేధిస్తున్నాయని, లక్షల మంది విద్యార్థులు రియింబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్న నేపథ్యంలో ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత విద్య సంవత్సరం నష్టపోకుండా అప్పులు చేసి మరి ఫీజులు కడుతున్నారని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం గతంలో రెండు సార్లు యాజమాన్యాలు సమ్మె చేస్తే బకాయిలు ఇస్తామని చెప్పి మాట తప్పి మోసగించారని మండిపడ్డారు. మళ్ళీ ఇప్పుడు విద్యా సంవత్సరం పూర్తయ్యే పరిస్థితి వచ్చిందని మళ్లీ విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం ఉందని, ఇంటికి వస్తే అందరిని కలుస్తానని మాట్లాడిన రేవంత్ రెడ్డి మోసగించారన్నారు. రేపటినుండి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల అయ్యేంతవరకు రాష్ట్ర వ్యాప్తంగా మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని, ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రాకముందే వెంటనే ఈ విద్యా సంవత్సరం వరకు పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## పాపిరెడ్డిగూడ అవాజీమియా పడకల్ లో

## రూ.82 లక్షలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కీ.శే.తాండ్ర వీరేందర్ రెడ్డి చిరకాల కోరిక నెరవేర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట మాజీ జడ్పిటిసి,తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి



**కేశంపేట,(ప్రజావినికిడి):**
కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని అవాజీమియా పడ్కాల్ గ్రామంలో రూ.82 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నదని తెలిపారు.రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని,స్థానిక అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గూడ వీరేష్,గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.గ్రామ ప్రజలు ఈ అభివృద్ధి పనులు ప్రారంభం కావడంతో సంతోషం వ్యక్తం చేశారు.

## త్రాగు నీటి పంపు చుట్టూ మురికి నీటి తొలగింపు



**వాజేడు,ఏప్రిల్ 29,(ప్రజావినికిడి):**
గుమ్మడిదొడ్డి గ్రామం లో చేతి పంపు చుట్టూ మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంది. అది గమనించిన సర్పంచ్ బోదేబోయిన భరత్ కుమార్ నీరు నిలవకుండా సిమెంట్ తో ప్లాట్ ఫారం ఏర్పాటు చేసారు సర్పంచ్ తమ స్వంత ఖర్చు నాలుగు వేల రూపాయలు అందజేశారు.అనంతరం పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వలన అందరి ఆరోగ్యాలు బాగుంటాయని స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఫరూక్ నగర్ మండలం దూసకల్ గ్రామంలో బాలికల భద్రత విద్యపై ప్రత్యేక దృష్టి..

### డాక్టర్ శ్వేతా.. : బాలికల అవగాహనా సదస్సు..ఏర్పాటు..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**ఈ సందర్భంగా డాక్టర్ శ్వేతామాట్లాడుతూ,నేటి సమాజం లో బాలికల రక్షణ, వారి విద్యభివృద్ధి, ఆరోగ్యకరమైన జీవనశైలి పట్ల అవగాహనా కల్పించడమే లక్ష్యం అని ఫరూక్ నగర్ మండలం దూసకల్ గ్రామ డాక్టర్ శ్వేత మేడం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన తొంబై తొమ్మిది రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా మంగళవారం రోజు ఫరూక్ నగర్ మండలం దూసకల్ గ్రామం లో చైల్డ్ సేఫ్టీ, టీనేజ్ ప్రెగ్నెన్సీ, ఎలోప్మెంట్ అవగాహనా సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సదస్సు లో పాల్గొన్న డాక్టర్ శ్వేతా మేడం మాట్లాడుతూ,18 సంవత్సరాల లోపు బాలికలు పెళ్లిళ్లు చేసుకున్నట్లయితే రాబోయే రోజుల్లో శారీరక సమస్యలు, మానసిక సమస్యలు వస్తాయని అలాగే మానసిక ఆందోళన వత్తిడికి గురై ఆర్థికంగా నష్టం జరుగుతుందని అందుకే బాల్య వివాహాలు చేసుకోవద్దని సరైన సమయంలో పెళ్లిళ్లు చేసుకొని భవిష్యత్ లో మంచి ఉన్నతశిఖరాలు అధిరోహించాలని సూచించారు. అదేవిదంగా బాలికలు, మహిళల రక్షణ కొరకు ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన చట్టాలు, అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అదేవిధంగా సైబర్ భద్రత పై సూచనలు తెలియజేశారు.ఈ అవగాహనా సదస్సు లో గ్రామ సర్పంచ్ జ్యోతిర్మయి,అంజి డిప్యూటీ సర్పంచ్ కుమార్, పంచాయతీ సెక్రటరీ ఆరాధన డాక్టర్ శ్వేత మేడం, ఆశవర్కర్ మౌనిక, యాదమ్మ, అంగన్వాడీ టీచర్స్,అమృత, సుగుణ,పద్మ, హెల్పేర్ సుజాత, వి.వో ఏ.లు కమ్మరి లక్ష్మి,మొహమ్మద్ ఫాజియా,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏండి.నజీర్ కారాబర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆస్పత్రి వద్ద అన్నదానం

### 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ - అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సంస్థల నిర్వహణ



**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
ఆకలితో ఉన్న పేదలకు, ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు అండగా నిలిచేందుకు 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ మరోసారి తన ఉదారతను చాటుకుంది. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి వద్ద వద్ద అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సంస్థతో కలిసి ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఆసుపత్రులకు వచ్చిన సుమారు 300 మందికి పైగా పేదలకు,రోగుల సహాయకులకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని అందించారు. దూరప్రాంతాల నుండి చికిత్స కోసం వచ్చి, ఆకలితో అల్లాడుతున్న వారికి ఈ కార్యక్రమం ఎంతో ఊరటనిచ్చిందని శంకర్ అన్నారు.ఈ సేవా కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులతో పాటు పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ, మేము ప్రతి వారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఆకలి లేని సమాజమే మా లక్ష్యమన్నారు.ఈ సత్కార్యంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు, వాలంటీర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు

**2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు లక్ష్యంగా పనులు**

**రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు: మంత్రి నిమ్మల**



**అమరావతి,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కీలకమైన 11 ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమౌతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు, కరువు ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వివరించారు. మంగళవారం అమరావతిలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును గెజిట్‌లో చేరుస్తూ నోటిఫికేషన్ ఇవ్వడంలో సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో శ్రీకాకుళం జిల్లాలోని నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో నీటి పారుదల సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తితోపాటు ఉత్తరాంధ్రలోని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి విమర్శలు

**గూగుల్‌కు శంకుస్థాపన వేళ విపరీత ప్రచారాలు**

**తమ పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వారే విమర్శలా**

**వైసిపి తీరుపై మండిపడ్డ మంత్రి పార్థసారథి**

**మచిలీపట్నం,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** పెట్రోల్, డీజిల్ సమస్యపై వైసీపీ భయాందోళన పరిస్థితులు సృష్టిస్తోందని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి మండిపడ్డారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా రాష్ట్రంలో కొరత ఉన్న 75 శాతం బంకుల్లో ఆయిల్ సరఫరా చేశామన్నారు. బుధవారానికి పరిస్థితి పూర్తిగా అదుపులోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్యలపై కృష్ణా జిల్లా మొవ్వ మండలం కారకంపాడులో మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. అంతర్జాతీయ గూగుల్ సంస్థ విశాఖపట్నంలో శంకుస్థాపన జరుగుతున్న వేళ.. అది చూసి ఓర్వలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు వైసీపీ శాయశక్తులా కృషి చేస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం పరిశ్రమలు తెస్తున్నారంటూ వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారని మంత్రి పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులతో పాటు పలు పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగాయని.. ఇవన్నీ కనిపించడం లేదా? అంటూ వైసీపీ నేతలకు ఈ సందర్భంగా మంత్రి చురకలంటించారు. దేశంలో 25 శాతం పెట్టుబడులు మనరే వస్తున్నాయని వివరించారు. 2019-24లో ఎంత మంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి పారిపోయారో మీరు మర్చిపోయారా? అంటూ వైసీపీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ప్రతిపక్షమే ఒక పెద్ద దౌర్భాగ్యంగా తయారైందని మండిపడ్డారు. వారికి చట్ట సభల్లో ప్రశ్నించే ధైర్యం లేదన్నారు. వైసీపీ కావాలనే పానిక్ సిట్యువేషన్ సృష్టిస్తోందని ఆరోపించారు. దీంతో ప్రజలు భయపడి పెట్రోల్, డీజిల్ అధికంగా కొనుగోలు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ సమస్యపై సీఎం చంద్రబాబు నాయుడు రోజూ సమీక్షిస్తున్నారని మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. రైతులకు 6 నెలల్లో ఇవ్వలేని నగదును తాము 48 గంటల్లో ఇచ్చామని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి గుర్తు చేశారు. మొక్కజొన్న రైతుల సమస్యలపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. పొగాకు, కోకో, మామిడి రైతులకు నష్టం రాకుండా మద్దతు ధర చెల్లిస్తున్నామన్నారు. ధరల స్థిరీకరణకు రూ.800 కోట్లు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని చెప్పారు. రైతాంగ వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి.. ప్రస్తుతం మొసలి కన్నీరు కారుస్తున్నారంటూ వైసీపీ నేతల వైఖరిని మంత్రి పార్థసారథి ఎండగట్టారు. ప్రగల్భాలు మాని.. చిత్తశుద్ధి ఉంటే వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని వైసీపీ నేతలకు మంత్రి పార్థసారథి సూచించారు.

---------------

# శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

**దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం**



**తిరుమల,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ మురళీకృష్ణ, టిటిడి సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగా నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో భారత ఉపరాష్ట్రపతికి పండితులు వేదాశీర్వచనం చేయగా.. తితిదే ఛైర్మన్, ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. సోమవారం విశాఖ ఆంధ్రావర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక నేతలు, అధికారులు స్వాగతం పలికారు.

# ఇంధన కొరత వెనుక ప్రభుత్వ హస్తం

**అమరావతి పనులకు ప్రత్యేకంగా పెట్రోల్, డీజిల్ కోరడం చట్టవిరుద్ధం: సజ్జల రామకృష్ణారెడ్డి**

**ఇంధనాన్ని అమరావతికి మళ్లించడం వల్లే రాష్ట్రంలో కొరత ఏర్పడిందని ఆరోపణ**

**రాష్ట్రాన్ని చంద్రబాబు 20 ఏళ్లు వెనక్కి తీసుకెళుతున్నారని విమర్శ**



**అమరావతి,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**
ఏపీలో పెట్రోల్, డీజిల్ సంక్షోభంపై వైసీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ కొరత వెనుక కూటమి ప్రభుత్వ హస్తం ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో గత నాలుగైదు రోజులుగా ప్రజలు ఇంధనం కోసం అల్లాడుతుంటే ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అక్కడ లేని ఇబ్బందులు.... కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకు వస్తున్నాయని ఆయన నిలదీశారు. ముఖ్యంగా సివిల్ సప్లై కమిషనర్ రాసిన ఒక లేఖను సజ్జల ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఏప్రిల్ 24న ఆయిల్ కంపెనీలకు రాసిన లేఖలో, అమరావతి పనుల కోసం ప్రత్యేకంగా పెట్రోల్, డీజిల్ కేటాయించాలని కోరడం చట్టవిరుద్ధమని ఆయన మండిపడ్డారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం కూడా స్పందిస్తూ ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని సూచించిందని అన్నారు. రాజధాని పనుల పేరుతో సామాన్య ప్రజలకు అందాల్సిన ఇంధనాన్ని మళ్లించడం వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని సజ్జల విమర్శించారు.

చంద్రబాబు రాష్ట్రాన్ని మరో 20 ఏళ్లు వెనక్కి తీసుకెళుతున్నారని, కనీసం డీజిల్ కూడా సరఫరా చేయలేని ప్రభుత్వం ఇక పరిశ్రమలను ఏం తీసుకువస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించి, తద్వారా పానిక్ బయింగ్‌కు దారితీసేలా ప్రభుత్వమే ఈ కృత్రిమ సంక్షోభాన్ని సృష్టించిందని సజ్జల ధ్వజమెత్తారు.

# యుక్త వయసు (కిశోర) బాలికలకు అవగాహన సదస్సు

**కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ అగ్గునూర్ బసవేశ్వర్ : మున్సిపల్ కమిషనర్ సునీత**

**డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి,ఎంపీడీవో బన్సీలాల్**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఐసిడిఎస్ సూపర్వైజర్లు షాద్ నగర్ మున్సిపల్ ఆఫీసులో ఏర్పాటు చేశారు.ఈ కిషోర్ బాలికల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీత , డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జయలక్ష్మి,డాక్టర్ స్రవంతి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, కిషోర్ బాలికలు అంటే 10 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ఆడపిల్లలను కిషోర బాలికలు అంటారని,ఇది బాల్యం నుంచి యుక్త వయసుకు మారే దశ అని,ఈ వయసులో శారీరకంగా, మానసికంగా, చాలా మార్పులు జరుగుతాయని,జీవితంలో ఆరోగ్యానికి పునాదిపడేది,ఈ వయసులోనే అని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.ఈ వయసులో శారీరక మార్పులు ఎత్తు, బరువు వేగంగా పెరగడం జరుగుతుంది అని,రుతుక్రమము మొదలవుతుందని,శారీరక ఆకృతిలో మార్పులు వస్తాయని, హార్మోన్ల వల్ల మొటిమలు రావడం జరుగుతుందని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.ఈ వయసులో ఆరోగ్య సమస్యలు రక్తహీనత కలిగి ఉంటారని,రుతు సమస్యలలో కడుపునొప్పి సరైన అవగాహన లేకపోవడం జరుగుతుందని,పోషకాహారం లోపం వలన బరువు తక్కువగా ఉండటం జరుగుతుందని చెప్పారు.ఈ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహారము తీసుకొని, రుతుక్రమ సమయంలో శుభ్రమైన బట్ట లేదా నాప్కిన్ వాడాలని, రుతుక్రమంలో 4 నుండి 6 గంటలకు నాప్కిన్ మార్చాలని,ఈ వయసులో రోజుకు 30 నిమిషములు ఆటలు యోగా చేయాలని,మరియు మానసికంగా సంతోషంగా ఉండాలంటే స్నేహితులతో, తల్లిదండ్రులతో సమస్యలు పంచుకోవాలని, 14 నుంచి 15 సంవత్సరముల మధ్య వయసులో అమ్మాయిలు అందరూ కూడా తప్పకుండా హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకుంటే గర్భాశయ క్యాన్సర్ రాకుండా రక్షణ కలిగిస్తుందని తెలిపారు.చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవద్దని,చిన్న వయసులో పెళ్లి చేసుకుంటే ఎర్లీ ప్రెగ్నెన్సీ వస్తుందని,ఆ వయసులో శరీరము మనసు పూర్తిగా ఎదగకముందే తల్లి కావడం వల్ల చాలా సమస్యలకు దారి తీస్తుందని తెలియజేశారు.తల్లి ఆరోగ్యానికి నష్టాలు జరుగుతాయని,ఆ వయసులో తల్లి డెలివరీ అయ్యే సమయంలో ఎక్కువ రక్తం పోతుందని,ప్రీ ఎక్లాంప్సియా లో బీపీ పెరిగి కాళ్లు ముఖం వాపు రావడం,పీట్స్ వస్తే తల్లి బిడ్డ ఇద్దరికీ ప్రమాదం జరుగుతుందని డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు.చిన్న వయసులో పెళ్లిళ్లు జరుగుతే ఎక్కువ అబార్షన్లు జరిగే అవకాశం ఉందని అలాగే నెలలు కాకముందుకే ప్రసవం జరిగే అవకాశం ఉందని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. అందువలన చిన్న వయసులో ఎవరూ పెళ్లిళ్లు చేసుకోకూడదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగునూరు బసవేశ్వర్ మునిసిపల్ కమిషనర్ సునీత,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి,డాక్టర్ స్రవంతి,మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీడీవో బన్సిలాల్, ఐసిడిఎస్ సూపర్వైజర్లువిజయ, సంధ్య,రాణి,వెంకటమ్మ మరియు అంగన్వాడి టీచర్స్,విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.

# ఎల్కగూడ గ్రామ సర్పంచ్ బందయ్యా పై జరిగిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

**విలేకరుల సమావేశంలో పద్మారం మాజీ ఎంపీటీసీ మాణయ్య,కార్మిక సంఘం నాయకులు నర్సింలు తదితరులు**



**జిల్లేడు చౌదరిగూడ,(ప్రజావినికిడి):** మండలంలోని పద్మారం గ్రామంలో నిర్వహించిన ఈదమ్మ జాతరలో ఎల్కగూడ గ్రామ సర్పంచ్ బందయ్య పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పద్మారం మాజీ ఎంపీటీసీ మాణయ్య,పలువురు నేతలు అన్నారు.మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ఇద్దరు రెడ్డి సామాజిక వర్గాల మధ్య చోటు చేసుకున్న వివాదంలోకి బీసీ,ఎస్సీ,ఎస్టీలను లాగి వారితో కుట్రపూరిత రాజకీయాలు చేసేందుకు పలువు నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.చిలకమర్రి రామ్ రెడ్డి,ఎర్రబోతు రాంరెడ్డిల మధ్య సీసీ రోడ్డు పంచాయతీ ఉందని,ఇదే విషయమై పలువురు ఇరువు వర్గాలుగా చీలిపోయారని వివరించారు.

ఇందులో భాగంగానే మాదిగ బిడ్డలను బలి పశువులుగా చేసి పబ్బం గడుపుకునేందుకు రాజకీయ కక్ష సాధింపులకు దిగుతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదని,ఎల్కగూడ గ్రామ సర్పంచ్ బందయ్య భార్య చెప్పుతో ఓ దళిత బిడ్డపై దాడి చేస్తే ఎవరు కూడా స్పందించలేదని గుర్తు చేశారు. గతంలో నాగర్ కర్నూల్ జిల్లాలో ఇదే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి దాడి చేస్తే రజక కులానికి చెందిన మూడు నెలల పసికందు మృతి చెందిన సంఘటనపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ స్థాయిలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు.వనం పల్లి గ్రామంలో కూడా దళితులపై దాడులు జరుగుతే కనీస స్పందన లేదని వాపోయారు.రజక సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్ పై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి దాడి చేయడం దురదృష్టకరమని,అయినప్పటికీ ఈ సంఘటనను అదునుగా చేసుకొని కుట్రపూరిత రాజకీయాలను ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసం అని, నిత్యం కలిసిమెలిసి ఉండే ప్రజల మధ్య రాజకీయ చిచ్చుపెట్టి వర్గాలుగా విడదీయడం దేనికి నిదర్శనమో రాజకీయం చేస్తున్న నేతలు చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా కుట్రపూరిత రాజకీయాలను మానుకొని గ్రామాల అభివృద్ధికి,బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాస్కర్,మాజీ ఎంపిటిసి రాములు, వార్డు సభ్యులు వంశీ, నరసింహులు, భీమయ్య, మోతీలాల్, జహంగీర్, మహేందర్, మల్లేష్,నరేష్ గౌడ్,కృష్ణులు పాల్గొన్నారు.

# వికలాంగుల పెన్షన్ రూ.6000లకు పెంచాలి

**హామీల అమలుకు ఉద్యమం చేస్తాం**

**ఎన్పి ఆర్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న భుజంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ సమావేశం పట్టణంలోని యూనివర్సల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు హాజరై మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించలేదని ఆయన విమర్శించారు.మొత్తం రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం-2016 ప్రకారం 5 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ,ఆ దిశగా చర్యలు కనిపించడం లేదన్నారు.గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పోల్చితే ప్రస్తుత బడ్జెట్‌లో కూడా ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళా, శిశు, వికలాంగుల,వయోవృద్ధుల సంక్షేమ శాఖకు కేటాయించిన నిధుల్లో వికలాంగుల వాటాను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు చేయూత పెన్షన్లను పెంచడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ప్రజాపాలనలో లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ, పరిమిత సంఖ్యలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ప్రకటించడం సరైంది కాదన్నారు. బాలభరోసా వంటి పథకాలకు నిధులు కేటాయించకపోవడం వల్ల వాటి అమలు సందిగ్ధంలో పడిందని తెలిపారు. వికలాంగులకు అవసరమైన సహాయ పరికరాలు,ప్రభుత్వ కార్యాలయాల్లో సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం కూడా వికలాంగుల హక్కులకు సంబంధించిన చట్టాల అమలులో విఫలమవుతోందని ఆరోపించారు.ఎన్ పి ఆర్ డి జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు మాట్లాడుతూ,జిల్లాలో వికలాంగులకు అందాల్సిన సహాయ పరికరాలు,స్వయం ఉపాధి రుణాలు అందడం లేదన్నారు.సమస్యల పరిష్కారం కోసం అధికారులు స్పందించడం లేదని,ప్రతి నెలా ఇవ్వాల్సిన పెన్షన్ల పంపిణీ ఆలస్యమవుతోందని తెలిపారు. సంక్షేమ పథకాలలో 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మొఘదటి ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.అనంతరం నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేయగా,మధునాల యాదయ్య, తుంపల్లి రవీందర్,ఏడమా మురళీధర్ రెడ్డి,శంకర్,నెహ్రూ, మనిలా,కుసుమ,జెసిక,గౌసియా తదితరులు సభ్యులుగా ఎంపికయ్యారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మహిళా బిల్లును ఆమోదించి తీరుతాం

## 40 ఏళ్లుగా విపక్షాలు అడ్డుకుంటూనే ఉన్నాయి

### వారణాసిలో ప్రధాని మోడీ




**వారణాసిఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టడానికి తాము ఎంతగానో ప్రయత్నించామని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్, ఎస్పీ వంటి ప్రతిపక్ష పార్టీల నీచ రాజకీయాల వల్లే ఆ చట్టం అమల్లోకి రాకుండా ఆగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అభివృద్ధి చెందడం, అసెంబ్లీలు, పార్లమెంట్‌లకు రావడం ప్రతిపక్షాలకు ఇష్టం లేదని..అందువల్లే 40 ఏళ్లుగా ఈ బిల్లును అడ్డుకుంటూనే ఉన్నారని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి కృషి చేస్తూనే ఉంటామన్నారు. వారణాసిలో నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఈ మేరకు ప్రసంగించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడమనే మహా యజ్ఞం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నానని..అందుకు మాతృమూర్తుల ఆశీస్సులు తీసుకునేందుకు వారణాసి వచ్చానని ప్రధాని పేర్కొన్నారు. ఈ బిల్లును తేవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని..ఇది రాజకీయ పార్టీల కోసం తెచ్చింది కాదని అన్నారు. సాధారణ కుటుంబాల మహిళలు పార్లమెంటు, అసెంబ్లీలకు రావాలని కోరుకున్నానని తెలిపారు. కానీ ప్రతిపక్షాలు మాత్రం అధికారం తమ కుటుంబాలకే పరిమితం కావాలని కోరుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లపై తమ పోరాటం ముగిసిపోలేదని, చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామన్నారు.

----

# పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెంపు

## దేశవ్యాప్తంగా కొరతపై పుకార్లు -పుకార్లను ఖండించిన కేంద్రం

### అలాంటి ఆలోచన లేదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**

నేడు బెంగాల్ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారంటూ వస్తున్న పుకరా÷-లను కేంద్రం తోసిపుచ్చింది. అయితే అలాంటిదేమీ లేదని వినియోగదారులకు హామీ ఇచ్చింది. పశ్చిమబెంగాల్ పోలింగ్ ఈనెల 29న పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్నాయంటూ వస్తున్న ఊహాగానాలను కేంద్రం కొట్టివేసింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని వివరణ ఇచ్చింది. పశ్చిమాసియాలో ఘర్షణలతో గత రెండు నెలలుగా క్రూడాయిల్ ధరలు 50 శాతం పెరిగాయి. అయినప్పటికే రికార్డు స్థాయిలో గత నాలుగేళ్లుగా రిటైల్ పెట్రోల్, డిజిల్ ధరల్లో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు. పశ్చిమాసియాలో తలెత్తిన ఘర్షణల కారణంగా చమురు ఉత్పత్తి ధరలు, పంప్ ధరల మధ్య వ్యత్యాసం పెరగింది. దీంతో ఇంధనం రిటైలర్లు ప్రతిరోజూ రూ.2,400 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారంతో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పూర్తికాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం అనివార్యమని బలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దీనిపై పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ మాట్లాడుతూ, పెట్రోలో, డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో 'ప్యానిక్ బైయింగ్' జరుగుతున్నట్టు తెలుస్తోందని, ఆయా ప్రాంతాల్లో పరిస్థితి గురించి రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతర సంప్రదింపులు జరుపుతున్నామని, రిటైల్ ఔట్‌లెట్స్‌ను మానిటర్ చేస్తున్నామని, అవసరమైన సరఫరాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, స్టాక్ అందుబాటులో ఉండేలా చూస్తున్నామని, ఎలాంటి డ్రైఔట్‌లు లేవని చెప్పారు. 'తగినన్ని ఎల్‌పీజీ, పెట్రోల్, డీజిల్ సరఫరాలు మావద్ద ఉన్నాయి. ధరలు కూడా నిలకడగా ఉన్నాయి. రేట్లలో ఎలాంటి పెరుగుదల లేదు' అని వివరించారు. వదంతులు నమ్మవద్దని కోరారు.

---------

# ఆంధ్రాలో కొలిక్కి వచ్చిన పెట్రో సమస్య

## సరఫరా యధావిధిగా ఉన్నట్లు ప్రకటన




**అమరావతి,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**
ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని రోజులుగా ఎదురైన పెట్రోల్, డీజిల్ కొరత సమస్య క్రమంగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయానికి రాష్ట్రంలోని సుమారు 90 శాతం పెట్రోల్ బంకుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లు అధికారులు వెల్లడించారు. సరఫరా మెరుగుపడటంతో పెట్రోల్ బంకుల వద్ద రద్దీ భారీగా తగ్గిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సమస్యను అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ఇంధన సరఫరాను వేగవంతం చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈరోజు సాయంత్రం 6 గంటల వరకు వినియోగదారులకు 5,373 కిలోలీటర్ల పెట్రోల్, 8,777 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఇదే రోజు స్టాక్ పాయింట్ల నుంచి పెట్రోల్ బంకులకు 10,402 కిలోలీటర్ల పెట్రోల్, 17,805 కిలోలీటర్ల డీజిల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు ఉదయం వరకూ ఏపీలోని 100 శాతం బంకుల్లో పెట్రోల్, డీజిల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు. పరిస్థితి మెరుగుపడటంతో అధికారులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

---------


# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత


**హైదరాబాద్,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**
గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా.. వీటి అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. మంగళవారం హైదరాబాద్ మహానగరంలో భారీ ఎత్తున డ్రగ్స్, విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు పట్టుకున్నారు. స్టేషన్‌లో ఇద్దరు మహిళల నుంచి 11.4 కిలోల నిషేధిత అంఫెటమైన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరినీ అరెస్ట్ చేసి.. విచారణ కోసం డీఆర్ఐ కార్యాలయానికి తరలించారు. స్వాధీనం చేసుకున్న ఈ డ్రగ్స్ విలువ రూ.11.40 కోట్లు ఉంటుందని డీఆర్ఐ అధికారులు తెలిపారు. సోమవారం బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రయాణికుడి వద్ద నుంచి 6.5 కేజీల విదేశీ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 2.15 కోట్ల ఉంటుందని తెలిపారు. డీఆర్ఐ అధికారులు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మాటు వేసి.. అతడిని పట్టుకున్నామని కస్టమ్స్ అధికారులు వివరించారు. ఎవరికీ అనుమానం రాకుండా లగేజ్ బ్యాగులో దాచి విదేశీ గంజాయిని తీసుకొచ్చినట్లు తెలిసింది. స్మగ్లర్‌పై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు.

# ఫ్రీడమ్ ఫైటర్ పేరిట రూ.800 కోట్ల భారీ దోపిడీ

## -ఎంగిలి మెతుకులకు వ్యవస్థను అమ్మేసిన అధికారులు..?


### -త్యాగధనుల పేరుతో అక్రమార్కుల 'విశ్వరూపం' -విజిలెన్స్ విచారణలో షాకింగ్ నిజాలు..!











GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

From
The Collector & District Magistrate,
Medchal Malkajgiri District

To
The Revenue Divisional Officer,
Keesara Division,
Medchal Malkajgiri District

Lr.No.E2/364/2025, dated.19.01.2026

Sir,

Sub: Lands – Medchal Malkajgiri District - Keesara Division - Uppal Mandal Bandlaguda Village - Sy.No.36/5 - Complaint received – Instructions issued- Regarding.

Ref:
1. Tahsildar, Uppal Mandal, Lr.No.B/724/2025, dated.06.06.2025.
2. The RDO, Keesara Division, Lr.No.B/577/2025, dated.18.09.2025.
3. This office lr.no.even, dt:-22-11-2025 addressed to the Government in Home department.
4. The Govt memo.no.32259/LM&FF/A2/2025, Revenue (Land matters & Freedom Fighters) Dept, dt:-31-12-2025.

&&&

Your attention is invited to the subject cited and reference 3rd cited, wherein, report is submitted to address the Home Department of Telangana State to ascertain whether Rachakonda Kanakaiah was Freedom fighter or not for further conclusion of the matter.

In the reference 2nd cited, the Government was addressed to communicate the list of freedom fighters pertaining to erstwhile Ranga Reddy District or any other details/documents to confirm whether Sri. Rachakonda Kanakaiah was a freedom fighter/political sufferer, so as to take further necessary action in the matter.

In the reference 3rd cited, the Government have informed that, after thorough search, the details of Rachakonda Kanakaiah (freedom fighter) is not traced out.

In view of the above, it is requested to take necessary action as per the Telangana Bhu Bharati (Record of Rights in land) Act, 2025 read with Telangana Bhu Bharati (Record of Rights in land) Rules, 2025 duly issuing notices to all the concerned.

Yours faithfully,
Sd/-
District Collector,
Medchal Malkajgiri District

//Attested//
Superintendent, Collectorate,
Medchal Malkajgiri District

// Issued Under RTI Act //

**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
అధికార గర్వం, అధికారుల అవినీతి దాహం తోడైతే ప్రభుత్వ ఆస్తులకు రక్షణ ఉండదని బండ్లగూడ భూ కుంభకోణం నిరూపించింది. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల పేరును కూడా వదలకుండా,నకిలీ పత్రాలతో అక్షరాలా రూ. 800 కోట్ల విలువైన ప్రభుత్వ సంపదను కొల్లగొట్టేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఉప్పల్ మండలం బండ్లగూడలోని సర్వే నంబర్ 36/5లో సాగిన ఈ అక్రమ భాగోతం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోందని సామాజిక కార్యకర్త బాబా గౌడ్ పేర్కొన్నారు.

**-కుంభకోణం వెనుక 'సూత్రధారి' యంత్రాంగం బరితెగింపు..!**

ఈ బహుకోణ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి దేపా భాస్కర్ రెడ్డి అని దర్యాప్తులో తేలింది. రాచకొండ కనకయ్య అనే వ్యక్తికి,అసలు ఉనికిలో లేని 'స్వాతంత్ర్య సమరయోధుడి' ముసుగు తొడిగి, ఫోర్జరీ రికార్డులతో సుమారు 10 ఎకరాల అత్యంత విలువైన భూమిని తన ఖాతాలో వేసుకునేందుకు తెగబడ్డారు.

'కంచె చేను మేసిన చందంగా' వ్యవస్థను కాపాడాల్సిన అప్పటి ఉప్పల్ తహశీల్దార్ రమేష్ కుమార్,కీసర ఆర్డీఓ లచ్చిరెడ్డి నిబంధనలను తుంగలో తొక్కి అక్రమార్కులకు రెడ్ కార్పెట్ పరిచారు. కళ్లు మూసుకుని రిపోర్టులు ఇచ్చారా? లేక కాసుల కక్కుర్తితో ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నారా? అన్నది ఇప్పుడు సమాజం అడుగుతున్న సూటి ప్రశ్న.

**ప్రభుత్వ ఖజానాకు భారీ కన్నం..**

బహిరంగ మార్కెట్లో గజం లక్షల్లో పలుకుతున్న ఈ ప్రాంతంలో, సర్కారు భూమిని ప్రైవేటు పరం చేయడం ద్వారా ప్రభుత్వానికి వందల కోట్ల నష్టం వాటిల్లింది. ఇది కేవలం భూమి కబ్జా మాత్రమే కాదు, ప్రజల నమ్మకంపై జరిగిన దాడి.



**త్యాగధనుల పేరిట దగా.. బట్టబయలైన బండారం..!**

స్వాతంత్ర్య సమరయోధుల జాబితాలో లేని వ్యక్తిని 'ఫ్రీడమ్ ఫైటర్'గా చిత్రించడం ఈ కుంభకోణంలో అత్యంత హేయమైన అంశం. సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ సాహసోపేతమైన పోరాటంతో ఈ అక్రమ సామ్రాజ్యం కుప్పకూలింది. హోం శాఖ, రెవెన్యూ విభాగాల రికార్డుల్లో ఎక్కడా లేని వ్యక్తికి భూమిని ఎలా కేటాయించారో అధికారులకే తెలియాలి. ఇది అక్షరాలా 'గద్దల' వేట.

"ప్రభుత్వ భూమి అంటే పాలకుల జాగీరు కాదు,అది ప్రజల ఆస్తి. త్యాగధనుల పేరు చెప్పి దోచుకున్న ఈ తిమింగలాలను, వారికి సహకరించిన అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలి..

బాధిత ప్రజల ఆగ్రహం..

## ప్రభుత్వ యాక్షన్ : క్రిమినల్ వేట షురూ!

విజిలెన్స్ విచారణలో అక్రమాలు అడ్డంగా దొరికిపోవడంతో సీసీఎల్ఏ కఠిన ఆదేశాలు జారీ చేసింది:

1. తక్షణ స్వాధీనం: తెలంగాణ భూ భారతి చట్టం 2025 ప్రకారం,ఆ 10 ఎకరాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు అందాయి.
2. క్రిమినల్ కేసులు:ఫోర్జరీ పత్రాల సృష్టికర్త భాస్కర్ రెడ్డితో పాటు,విధులను విస్మరించిన అధికారులపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.
3. సమగ్ర ప్రక్షాళన:ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు 'పెద్దల' జాతకాలను బయటకు తీసేందుకు విజిలెన్స్ రంగంలోకి దిగింది.

అక్రమంగా విక్రయించిన ప్లాట్ల విషయంలో కొనుగోలుదారులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. అధికారుల అండ ఉన్నా, రాజకీయ బలం ఉన్నా ప్రజల ఆస్తిని కాజేస్తే జైలు గోడలు తప్పవు, ఈ ఘటన భూ కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది.

# కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి భేటీ

### రాష్టానికి రావాల్సిన సాయం తదితర అంశాల ప్రస్తావన

**హైదరాబాద్,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**



కేంద్రమంత్రి రాజీవ్ రంగన్ సింగ్‌తో వాకిటి శ్రీహరి భేటీ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన సాయం తదితర అంశాలను ప్రస్తావించారు. రాజేంద్ర నగర్ లోని జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌తో యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ తదితరులు ఆయన వెంట ఉన్నారు. పశు సంవర్ధక, పాడి, మత్స్య శాఖల్లో తెలంగాణ అమలు చేస్తున్న పథకాలను కేంద్రమంత్రికి మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. కేంద్రం నుంచి తెలంగాణకు సహకారం ఇవ్వాలని కేంద్రమంత్రిని కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను శాలువా, పూల బోకే, మెమోటెంతో ఘనంగా సన్మానించిన మంత్రి వాకిటి శ్రీహరి రాష్ట్రానికి కేంద్రం నుంచి కావలసిన సహకారం, ఆక్వా కల్చర్, లైఫ్ సైన్సెస్ లో ఇన్సూరెన్స్, మోపెడ్ కేటాయింపుల్లో న్యాయం వంటి పలు అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.గోదావరి, కృష్ణా నదుల మధ్య ఉన్న 46 వేల పెద్ద చెరువులు, 26 వేల చిన్న చెరువులు, 100 రిజర్వాయర్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చే నిధులను తీసుకు రావడంలో విఫల మయింది.రాజేంద్ర నగర్ లో ఉన్న ఎన్ఎఫ్‌డిసిని తరలించమని కేంద్రమంత్రి హామీ ఇచ్చారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తరలింపుపై వస్తున్న ప్రచారంపై కేంద్రమంతి రాజీవ్ రంజన్ దృష్టికి మంత్రి వాకిటి శ్రీహరి తీసుకుపోయారు. దీనిని తరలించే ఆలోచన లేదని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు.

# డైరెక్టర్ బ్రిగేడియర్ యన్.ఆర్.బాబు, ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి తో భేటీ

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**



తెలంగాణా సైనిక సంక్షేమ శాఖ నూతనంగా నియమించబడిన డైరెక్టర్ బ్రిగేడియర్ యన్.ఆర్.బాబు, మంగళవారం రోజు మాజీ సైనికుల సమస్యల గురించి మొదటిసారిగా ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి తో బిఆర్ అంబేద్కర్ సచివాలయం లో వారి చాంబర్ లో కలిసి చర్చించటం జరిగింది.ముఖ్యంగా మాజీ సైనికులకు అత్యధిక ఎంప్లాయిమెంట్ కల్పన కొరకు మాజీసైనిక కార్పొరేషన్ తెలంగాణా లో ఏర్పాటు చేయాలని దానివలన మాజీ సైనికులకు ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయని అలాగే ఇతర ప్రయోజనాలు కూడా ఉంటాయాని వివరించటం జరిగింది.అదే విధంగా ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే రాజ్య సైనిక బోర్డు మీటింగ్ జరపాలని గత అనేక సంవత్సరాలనుండి ఈ మీటింగ్ జరగట్లేదని దానివల్ల మాజీ సైనికులకు అదేవిదంగా వారిపైన ఆదార పడినవారికి ఇతర డిపార్ట్మెంట్ వారితో జరగాల్సిన అనేక పనులలో జాప్యం జరుగుతుందని కావున రాజ్య సైనిక్ బోర్డు మీటింగ్ త్వరలోనే జరపాలని కోరడం జరిగింది దానికి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ వి శేషాద్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని పోతానని తప్పక త్వరలోనే మీటింగ్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.అదేవిదంగా సైనిక సంక్షేమ శాఖ లోని అధికారుల కాళీలను భర్తీ చేయాలని కోరిన్నారు.అలాగే మాజీ సైనికులకు టి జి పి ఎస్ సిపరీక్ష లలో కట్ ఆఫ్ మార్కులు 40% నుండి 30% శాతానికి తగ్గించాలని దాని వల్ల మాజీ సైనికులకు ఎంతో ఉపయోగం ఉంటుందని వారి దృష్టికి తేవడం జరిగింది.ఇంకా అనేక సమస్యలగురించి ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకురావడం జరిగింది అన్నింటికీ సానుకూలంగా స్పందించి నదుకు వారికి ధన్యవాదములు తెలిపినారు.ఈ మీటింగ్ లో రంగారెడ్డి జిల్లా సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి కూడా పాల్గొన్నారు.

# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !

**ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**
రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ



పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్హెచ్ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన పక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత
గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యా యని, నీటి ఒత్తిడి కూడా ఎన్టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు. అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్అండ్‌బి, జలవనరులు, ఎన్హెచ్ఎఐ అధికారులను ఆదేశించింది. అభివృద్ధి పేరిట భారీగా భూములు గుంజుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ఒఆర్ఆర్ ను 70 మీటర్లకే పరిమితం చేయడం విజ్ఞతగా ఉంటుంది. భూమి కోల్పోయే రైతులను, నష్టపోయే ప్రజలను భాగస్వాములను చేసి వారి ఆమోదంతోనే ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది. అలాగే భూములు కావాల్సి వచ్చినప్పుడు బహిరంగ మార్కెట్ ధరలు చెల్లించి సేకరించడం అవసరం. అంతేగానీ రైతులను మహ్యా పెట్టి, వారిని కూలీలుగా దిగజార్చే చర్యలు మాత్రం సహించరానివి.


------------

## సిక్కిం ఆవిర్భావ దినోత్సవం

# పిల్లలతో కలసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని

**న్యూఢిల్లీఏప్రిల్ 28 (ప్రజావినికిడి)::** నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని





నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు.
అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

# వివాదంలో అషురెడ్డి వ్యవహారం

### పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు

### ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు

### హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**
బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు



చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ


## 14మంది మహిళల దుర్మరణం

**జకార్తా,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు పక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

# కాలువలకు మరమ్మత్తులు

## తెలుగుగంగ ద్వారా కృష్ణాజలాలు నిలివివేత

**చిత్తూరు,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):**
తెలుగు గంగ ప్రాజెక్టు కింద చెన్నైకి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణానది నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఏపీ సరిహద్దు ప్రాంతమైన కండలేరులో నిల్వవుంచుతారు. అక్కడి నుండి తెలుగుగంగ కాలువ ద్వారా



తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ప్రస్తుతం కండలేరు–పూండి మధ్య తెలుగుగంగ ప్రాజెక్టులో ఏపీ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల కారణంగా కృష్ణాజలాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఈ నెలాఖరుకు పూర్తిచేశాక మే 1వ తేదీ నుంచి యథావిధిగా కృష్ణాజలాలను సరఫరా చేయనున్నట్లు ఏపీ అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ తెలిపింది. ఇదిలాఉండగా, నగరవాసులదాహార్తిని తీరుస్తున్న పూండి, చెంబరంబాక్కం, పుళల్, షోళవరం, కన్నన్‌కోట, తేర్వైకండిగై రిజర్వాయర్లలో ప్రస్తుతం 7,966 మిలియన్ ఘనపుటడుగుల నీటిని నిల్వవుంచినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు నిల్వవుంచిన నీటిమట్టం కంటే 36 మిలియన్ ఘనపుటడుగులు తక్కువని, ఈ వేసవి సీజన్‌లో తాగునీటి కొరత ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

---------

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



**హైదరాబాద్,ఏప్రిల్ 28 (ప్రజావినికిడి):** డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.



# ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి మిచెల్ స్టార్క్

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభమై సగం మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు ఊరటనిచ్చే వార్త అందింది. ఆస్ట్రేలియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఎట్టకేలకు తన ఫ్రాంచైజీతో చేరాడు. క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి నిరభ్యంతర పత్రం లభించడంతో స్టార్క్ ఢిల్లీ జట్టులో చేరినట్లు యాజమాన్యం ధృవీకరించింది. మెగా వేలంలో రూ. 11.75 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ స్టార్ బౌలర్ అందుబాటులోకి రావడం ఢిల్లీ బౌలింగ్ విభాగానికి కొండంత అండగా మారనుంది. మిచెల్ స్టార్క్ ఈ ఏడాది జనవరి చివరి వారం నుండి ఎటువంటి పోటీ క్రికెట్ ఆడలేదు. ఆస్ట్రేలియాలో జరిగిన బిగ్ బాష్ లీగ్ లో సిడ్నీ సిక్సర్స్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సమయంలో ఆయన గాయపడ్డారు. బౌండరీ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో స్టార్క్ ఎడమ భుజం మరియు మోచేతికి తీవ్రమైన గాయమైంది. ఈ గాయం కారణంగా ఫిట్‌నెస్ సాధించడం ఆలస్యం కావడంతో, ఐపీఎల్ ప్రారంభ మ్యాచ్‌లకు ఆయన దూరం కావాల్సి వచ్చింది. ఇప్పటివరకు ఢిల్లీ ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో స్టార్క్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం రాత్రి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ అనంతరం ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ స్టార్క్ రాకపై స్పందించారు. “అవును, మిచెల్ స్టార్క్ జట్టుతో చేరారు. ఆయనకు మే 1వ తేదీ నుండి ఆడేందుకు ఎన్‌ఓసీ లభించింది. ప్రస్తుతానికి ఆయన వర్క్‌లోడ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ఆయన పూర్తిగా అందుబాటులోకి వచ్చిన వెంటనే తుది జట్టులోకి తీసుకుంటాం” అని అక్షర్ పేర్కొన్నారు. గత సీజన్‌లో 11 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసి స్టార్క్ అద్భుతంగా రాణించారు. స్టార్క్ రాక వార్త ఒకవైపు సంతోషాన్ని కలిగిస్తున్నా, సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ ప్రదర్శన మాత్రం పీడకలలా మిగిలిపోయింది. ఆర్సీబీ బౌలర్ల ధాటికి ఢిల్లీ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. పవర్‌ప్లేలోనే ఏకంగా ఆరు వికెట్లు కోల్పోయి 75 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆర్సీబీ వికెట్ కోల్పోకుండా సునాయాసంగా ఛేదించింది. ఈ ఘోర ఓటమిపై అక్షర్ పటేల్ అసహనం వ్యక్తం చేశారు. “అసలేం జరిగిందో నాకిప్పటికీ అర్థం కావడం లేదు. క్రికెట్‌లో ప్రతిరోజూ కొత్త సవాళ్లు ఎదురవుతాయి. ఈ ఓటమిని మర్చిపోయి వచ్చే మ్యాచ్‌పై దృష్టి సారించాల్సి ఉంది” అని ఆయన అన్నారు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి పడిపోయిన ఢిల్లీ క్యాపిటల్స్, తన తదుపరి పోరులో మే 1వ తేదీన జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. అదే రోజున స్టార్క్ అందుబాటులోకి వస్తుండటంతో, రాజస్థాన్ పటిష్టమైన బ్యాటింగ్ ఆర్డర్‌ను స్టార్క్ ఏ మేరకు అడ్డుకుంటాడో చూడాలి.

# శాంట్నర్ స్థానంలో కేశవ్ మహరాజ్ ముంబయి జట్టులోకి రానున్న స్పిన్నర్

ఐపీఎల్ 2026లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్న ముంబయి ఇండియన్స్ కష్టాలు రెట్టింపయ్యాయి. ఆ జట్టు ప్రధాన స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ భుజం గాయం కారణంగా ఈ సీజన్ నుండి వైదొలిగారు. బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో ఆయనకు ఈ గాయమైంది. శాంట్నర్ స్థానంలో దక్షిణాఫ్రికా వెటరన్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ముంబయి జట్టులోకి తీసుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన హోమ్ మ్యాచ్‌లో శాంట్నర్ ఫీల్డింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బౌండరీ వద్ద ఒక కఠినమైన క్యాచ్‌ను అందుకునే క్రమంలో ఆయన భుజానికి తీవ్రమైన గాయమైంది. అదే సమయంలో ఆయన తల కూడా బలంగా నేలకు తగిలింది. దీంతో ఆయనను మైదానం నుంచి వెలుపలికి తీసుకెళ్లాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పటికే శాంట్నర్ తన 4 ఓవర్ల కోటాను పూర్తి చేసి, ఒక వికెట్ తీసి 44 పరుగులు సమర్పించుకున్నారు. శాంట్నర్ తలకు దెబ్బ తగలడంతో, నిబంధనల ప్రకారం శార్దూల్ ఠాకూర్‌ను కన్కషన్ సబ్‌స్టిట్యూట్‌గా జట్టులోకి తీసుకున్నారు. అయితే, ముంబయి అప్పటికే అల్లా గజన్ఫర్ స్థానంలో డానిష్ మలేవర్‌ను ‘ఇంపాక్ట్ ప్లేయర్’గా ఉపయోగించుకుంది. 208 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శార్దూల్ ఠాకూర్ 12 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఈ మ్యాచ్‌లో ముంబయి 103 పరుగుల భారీ తేడాతో ఓటమిని చవిచూసింది. శాంట్నర్‌ను గత కొంతకాలంగా భుజం గాయం వేధిస్తోంది. ఏప్రిల్ 4న ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆయన బౌలింగ్ చేయని భుజానికి చిన్న గాయమైంది. దీనివల్ల ఏప్రిల్ 7న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ఆయన దూరమయ్యారు. ఏప్రిల్ 12న ఆర్సీబీతో మ్యాచ్‌లో పునరాగమనం చేసినప్పటికీ, ఏప్రిల్ 23న చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో అదే భుజానికి మళ్ళీ గాయం కావడంతో ఈసారి టోర్నీ నుంచే తప్పుకోవాల్సి వచ్చింది. శాంట్నర్ స్థానాన్ని భర్తీ చేసేందుకు ముంబయి మేనేజ్‌మెంట్ దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌ను ఎంపిక చేసింది. రూ. 75 లక్షల కనీస ధరకు ఆయనను ఒప్పందం చేసుకున్నారు. మహరాజ్ గతంలో రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడారు. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ కావడంతో శాంట్నర్ లోటును ఆయన కొంతవరకు భర్తీ చేస్తారని ముంబయి ఆశిస్తోంది.





# కోహ్లీ మోస్ట్ ఎమోషనల్ మూమెంట్..

డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఈ సీజన్‌లోనూ దుమ్ములేపుతోంది. 7 మ్యాచ్‌ల్లో ఐదు విజయాలు సాధించిన ఆర్సీబీ.. 10 పాయింట్లతో రెండోస్థానంలో ఉంది. నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడుతోంది. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన తరువాత విరాట్ కోహ్లీ తొలిసారి తన సొంత మైదానం ఢిల్లీలో ఆడనున్నాడు. తన కెరీర్‌లో తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీని అందుకున్నప్పుడు కోహ్లీ ఎలా ఉన్నాడో ఆర్సీబీ ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా వెల్లడించాడు. జియోస్టార్ ‘ది కృనాల్ పాండ్యా ఎక్స్‌పీరియన్స్’లో మాట్లాడుతూ.. ట్రోఫీకి అత్యంత అర్హుడు విరాట్ కోహ్లీ, ఆర్సీబీ అభిమానులు అని అన్నాడు. మొదటి సీజన్ నుంచి విరాట్ కోహ్లీ ఆర్సీబీ టీమ్‌లో అంతర్భాగం అయయాడని.. ట్రోఫీ గెలిచినప్పుడు భావోద్వేగానికి గురికావడం చూడటం చాలా ప్రత్యేకమైనదని అన్నాడు. విరాట్ కోహ్లీ ఏడవడం చూడటం.. మీరు అభిమాని అయినా లేదా జట్టులో భాగమైనా.. ప్రతిఒక్కరికీ ఒక భావోద్వేగ క్షణం. చెన్నైతో ఆడి బస్సులో బయటకు వెళ్తున్నప్పుడు ఆర్సీబీ ప్రజలకు ఎంతో ప్రేమ ఉందో చూశా.. ఆ రోజు నేను అభిమానుల కోసం మనం తప్పకుండా కప్ గెలవాలని చెప్పాను. నేను ఆ మాట అన్నందుకు.. ఫైనల్‌లో గెలిచి మేము కల నెరవేర్చగలిగినందుకు సంతోషంగా ఉంది. ఈ ట్రోఫీకి అందరికంటే ఎక్కువగా అభిమానులే అర్హులు.. అలాగే విరాట్ కూడా. విజేతగా నిలవడంతో భాగమై.. చిన్న విధంగానైనా నా వంతు సహకారం అందించినందుకు నేను కృతజ్ఞుడను. నాకు దేశం కోసం ఆడటమే ప్రథమం. కానీ 18 ఏళ్ల తర్వాత ఆర్సీబీ కోసం గెలవడం.. జట్టుకు చక్కగా సహకరిస్తూ నా అత్యుత్తమ సీజన్‌ను సొంతం చేసుకోవడం నా జీవితంలోని అత్యుత్తమ క్షణాలలో ఒకటిగా నిలుస్తుంది.” అని కృనాల్ పాండ్యా చెప్పుకొచ్చాడు.కాల క్రమేణా తాను చాలా మారిపోయానని తన ఐపీఎల్ ప్రయాణం గురించి కృనాల్ పాండ్యా వివరించాడు. ఈ ప్రయాణంలో ముందుకు సాగుతున్నకొద్దీ.. ఎన్నో విషయాలు నేర్చుకుంటామన్నాడు. “నా విజయానికి చాలా వరకు నా తల్లిదండ్రులే కారణం. ఒక మనిషిగా నా వ్యక్తిత్వం మాత్రం మారలేదు. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్ ఆడేందుకు ఇప్పటికీ అంతే ఉత్సాహంగా.. ఆసక్తిగా ఉంటాను. నేను ఎప్పుడూ కుటుంబానికి ప్రాధాన్యతనిస్తా.. నా కుటుంబాన్ని, పిల్లలను, నా జీవితంలో కీలక పాత్ర పోషించిన నా భార్యను ఎక్కువగా ప్రేమిస్తాను.” అని కృనాల్ పాండ్యా అని చెప్పాడు. కృనాల్ పాండ్యా ఈ సీజన్‌లో 7 మ్యాచ్‌లలో 8 వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా ఐపీఎల్ కెరీర్‌లో 149 మ్యాచ్‌లలో 101 వికెట్లు తీయడంతో పాటు.. 1792 పరుగులు కూడా చేశాడు. ఐపీఎల్ మినీ వేలానికి ముందు కృనాల్ పాండ్యాను రూ.5.75 కోట్లకు ఆర్సీబీ అట్టిపెట్టుకుంది.



# బంతులు ఖచ్చితత్వంతో వేయాలి

అప్పుడే వైభవ్ ని అడ్డుకోవచ్చు
మిడిల్, ఆఫ్ స్టంప్ మీదుగా సంధించాలి

టీమిండియా మాజీ క్రికెటర్ చేతేశ్వర్ పుజారా ఐపీఎల్ లో నేడు మరో హైవెలాసిటీ మ్యాచ్ జరుగనుంది. ఈ సాయంత్రం చండీగఢ్ లో పంజాబ్ కింగ్స్ తో తలపడబోతోంది రాజస్థాన్ రాయల్స్. ఇప్పటివరకు ఓటమి ఎరుగని జట్టుగా ఉంటూ వస్తోన్న పీబీకేఎస్ ను వాళ్ల సొంత గడ్డపై రాజస్థాన్ రాయల్స్ ఎలా అడ్డుకుంటుందనేది ఈ రాత్రికి తేలిపోతుంది. పాయింట్ల పట్టిలో అగ్రస్థానంలో ఉన్న జట్లు ఇవి. పంజాబ్ టాప్ లో ఉండగా.. రాజస్థాన్ నాలుగో

సూర్యవంశీపైనే అందరి దృష్టి నిలిచిందనడంలో సందేహాలు అక్కర్లేదు. మొన్నటికి మొన్న సన్ రైజర్స్ హైదరాబాద్ పై సెంచరీ ఊది అవతలపడేశాడీ 15 సంవత్సరాల కుర్రాడు. అతన్ని అడ్డుకోవడంపైనే ఆ జట్టు భారీ స్కోర్ ఆధారపడి ఉంది. దీనికోసం పంజాబ్ కింగ్స్ ప్రత్యేకంగా వల పన్నడం ఖాయం. బౌలర్లు వేసే బంతులు ఖచ్చితత్వంతో కూడుకుని ఉండటం, సరైన్ లైన్ అండ్ లెంగ్త్ తో పడితేనే దాని ఫలితం ఉంటుంది.ఈ పరిస్థితుల మధ్య టీమిండియా మాజీ క్రికెటర్ చేతేశ్వర్ పుజారా తెరమీదికి వచ్చాడు. పంజాబ్ కింగ్స్ బౌలర్లకు కొన్ని సూచనలు చేశాడు. వైభవ్ సూర్యవంశీని త్వరగా అవుట్ చేసే విషయంలో ప్రత్యేకించి సీమర్ అర్షదీప్ సింగ్ కు చిట్కాలు ఇచ్చాడు. వైభవ్ సూర్యవంశికి బౌలింగ్ చేసేటప్పుడు మిడిల్, ఆఫ్ స్టంప్ మీదుగా బంతిని సంధించాలని చెప్పాడు. స్టార్ స్పోర్ట్స్ ‘గేమ్ ప్లాన్’ లో పుజారా మాట్లాడాడు. అర్షదీప్ బ్యాక్ ఆఫ్ లెంగ్త్ బౌలింగ్‌పై దృష్టి పెట్టాలని, స్లో బాల్స్, యార్కర్లను కూడా ప్రభావవంతంగా ఉపయోగించాలని సూచించాడు. “అర్షదీప్ లెఫ్ట్ ఆర్మ్ సీమర్ అయినందున వైభవ్ కోసం స్టంప్‌ల మీదుగా బౌలింగ్ వేయాలని, బంతి అతని నుండి బయటికి వెళ్ళేలా మిడిల్, ఆఫ్ స్టంప్ లపై పిచ్ అయ్యేలా లైన్ అండ్ లెంగ్త్ తో డెలివరీలు ఉండాలని ప్పాడు. వైభవ్‌కు బౌలింగ్ చేసినప్పుడు మొహిసిన్ కొంత సక్సెస్ అయ్యాడని గుర్తు చేశాడు పుజారా. అర్షదీప్ కూడా అలాంటి టెక్నిక్ నే ఫాలో అయితే వైభవ్ సూర్యవంశీ దూకుడును అడ్డుకోవచ్చని సూచించాడు. అవసరమైతే ఓవర్ మిడిల్ లో యార్కర్లు కూడా వేయాల్సి రావొచ్చని, ప్రారంభంలో, మొదటి నాలుగు లేదా అయిదు బంతులను మాత్రం మిడిల్ అండ్ ఆఫ్ స్టంప్‌పై బ్యాక్ వివరించాడు.

